క్లుప్తంగా

వజ్రోత్సవాల ఆహ్వాన పత్రికల విడుదల



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్యులు

కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో మహాకుంభాభిషేక వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం కోరారు. సోమవారం ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఆలయం నిర్మించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మే 4 నుంచి 8వ తేదీ వరకు వివిధ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మమత

డోన్ రూరల్: మండల పరిధిలోని కోట్లవారిపల్లి గ్రామం వద్ద సోమవారం రూరల్ ఎస్‌ఐ మమత వాహనాల తనిఖీ నిర్వహించారు. లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, హెల్మెట్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని.. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తప్పక లైసెన్స్ కలిగి ఉండాలన్నారు.

భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలి



విద్యార్థిని సన్మానించిన గ్రామస్తులు

ప్యాపిలి: పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థి కొమరేలి జగదీశ్ భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని మండల కోఆప్షన్ మెంబర్ రసూల్ అన్నారు. జలదుర్గం ఉన్నత పాఠశాలకు చెందిన జగదీశ్ ఈ ఏడాది పదో తరగతిలో 575 మార్కులు సాధించాడు. సోమవారం విద్యార్థిని సన్మానించారు. ఉన్నత స్థాయిలో స్థిరపడి భవిష్యత్తులో సమాజానికి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు వైబీ రంగస్వామి, మెకానిక్ రవి, ఆటో గోపాల్, పెద్దన్న, బొజ్జిరెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

అంకిరెడ్డిపల్లె సర్పంచ్‌గా దస్తగిరి




నియామక పత్రం అందిస్తున్న కార్యదర్శి సమిత

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్‌గా దూదేకుల దస్తగిరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికైన నాగన్న ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఉప సర్పంచ్‌గా ఉన్న దస్తగిరికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సమిత సర్పంచ్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని సర్పంచ్ తెలిపారు. వైస్ ఎంపీపీ దస్తగిరి, నాగరాజు సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డోన్ టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి మే 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకుని ఆ ప్రింట్‌ను సమీప ప్రభుత్వ ఐటీఐలో మే 24వ తేదీ సాయంత్రం 5గంటలలోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు స్థానిక ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి వాసి మృతి



వెంకటేశ్ (ఫైల్)

ప్యాపిలి: తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ శివారు ప్రాంతంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్యాపిలికి చెందిన హుసేనాపురం వెంకటేశ్ (50) మృతి చెందాడు. ప్యాపిలి నుంచి వెంకటేశ్, సూరి కలిసి బొలెరో వాహనంలో హైదరాబాద్‌కు మామిడి కాయల లోడ్‌తో బయలుదేరారు. హైదరాబాద్ శివారు ప్రాంతంలోని రింగ్ రోడ్డు వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని బొలెరో ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అందులో ఉన్న వెంకటేశ్ అక్కడికక్కడే మృతి చెందగా, సూరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు.

పొలానికి రక్ష.. భూసార పరీక్ష

- మట్టి పరీక్షలతో ఎన్నో ఉపయోగాలు
- ఫలితాల ఆధారంగా పంటసాగు చేస్తే మంచి ఫలితాలు

బనగానపల్లె: భూమి మిశ్రమ సమ్మేళనం. ఇందులో ఖనిజ లవణాలు, పోషకాలుంటాయి. ఇవే మొక్కల ఎదుగుదలకు ఆధారం. అయితే అధిక దిగుబడులు సాధించాలని రానురాను రసాయన ఎరువులు విపరీతంగా వినియోగించడంతో భూమి సారం కోల్పోతోంది. సరైన పోషక విలువలు లేకపోవడం వల్ల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పొలంలో ఆరోగ్యకరమైన పంట పండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్ పరిమాణాల్లో మార్పులను భూసార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. సూక్ష్మపోషకాల లోపాలను తెలుసుకోవడంతోపాటు భూమిలో ఏ పోషకాలు క్షీణించి ఏమి లోపించాయనే అంశాలు భూసార పరీక్షల ద్వారా తెలుస్తాయి. సేంద్రీయ కర్బనం తగ్గితే పచ్చిరొట్ట పంటలను సాగు చేసి నష్టాలను నివారించుకోవచ్చు. వ్యవసాయాధికారుల రికార్డుల ప్రకారం బనగానపల్లె నియోజకవర్గంలో 2.16 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది.

సూక్ష్మపోషకాలే కీలకం

పంటల సాగులో అధిక దిగుబడులు సాధించాలనే తపనతో మోతాదుకు మించి వాడుతున్న రసాయన ఎరువుల వల్ల భూమిలోని పోషకాలు నశించిపోతాయి. పొటాషియం ఎక్కువగా వాడడం వల్ల మెగ్నీషియం, జింక్, ఇనుము వంటి సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందకుండాపోతాయి. జింక్ లోపం కారణంగా మొక్క ఎదుగుదల తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుంది. సూక్ష్మ పోషకాలతో పాటు నైట్రోజన్ సేంద్రియ కర్బనాల స్థాయి చాలా కీలకం. సేంద్రియ కర్బనం లోపిస్తే భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుంది. ఎంత ఎరువు వేసినా భూమి గ్రహించకుండా నిస్సారమైపోతుంది. భూమిలో సేంద్రియ కర్బనం 0.5 శాతం నుంచి 0.76 శాతం వరకు ఉంటే సాధారణంగా పరగణిస్తారు. చాలా చోట్ల భూమిలో ఇది 0.1 నుంచి 0.20 శాతం వరకు ఉన్నట్లు గత పరీక్షల ద్వారా తెలుస్తోంది. పొలంలో సేకరించిన మట్టిని ప్రయోగశాలల్లో భౌతిక రసాయనిక పద్ధతుల్లో విశ్లేషించి నేల స్వభావం, లక్షణాలు, పోషక విలువల స్థాయి గుర్తిస్తారు. ఈ ఫలితాల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. ప్రతి మూడేళ్లకోసారి భూసార పరీక్షలు చేయించడం మంచిదని వ్యవసాయశాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.



మట్టి సేకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

మట్టి పరీక్షలతో ఉపయోగాలు

- మట్టి పరీక్షల్లో అమ్ల, క్షార లవణాల స్థాయి, సేంద్రియ కర్బనం, భాస్వరం, పొటాషియం ఎంత నిష్పత్తిలో ఉన్నాయో తెలుసుకొని సాగు చేసిన పంటకు వయసు, కాలాన్ని అనుసరించి ఎరువులను సమపాళ్లలో అందించవచ్చు.
- ఆమ్ల గుణం ఉన్న నేలకు సున్నం, క్షార గుణం ఉన్న నేలలను జిప్సంతో బాగు చేసుకోవచ్చు.
- నేలలో సహజంగా ఉన్న పోషకాల స్థాయిని తెలుసుకుని సాగు చేసే పంటలకు ఎరువుల మోతాదును నిర్ణయించుకోవచ్చు.
- నేల పోషక సామర్థ్యాన్ని తెలుసుకుని ఏ నేలలో ఏపంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో తెలుసుకోవడానికి వెసులుబాటు ఉంటుంది.
- సాగు చేసిన పంటకు నేలతో తగు నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్ష ద్వారా తగ్గిన పోషకాలను అందించి దిగుబడులు పెంచుకోవచ్చు.
- వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరగాలంటే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి.

భూసార పరీక్షలు ఎంతో మేలు



పది రోజులుగా పొలాల్లో మట్టి నమూన పరీక్షలు నిర్వహిస్తున్నాం. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే రైతులకు అధిక దిగుబడులు వస్తాయి. భూసార పరీక్షలు చేసి రైతులకు కార్డులు అందించే కార్యక్రమం ప్రారంభించాం. ఈ సంవత్సరం కూడా రైతులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం. రసాయన ఎరువులు అధికంగా వాడడం వల్ల భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుంది.

–సుబ్బారెడ్డి, వ్యవసాయాధికారి, బనగానపల్లె

నేడు డయల్ యువర్ డీఎం

బనగానపల్లె రూరల్: స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రవికిశోర్ తెలిపారు. ప్రయాణికులు తమ సమస్యలను 99592 25802కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. డిపో పరిధిలో ఉన్న రూట్లలో స్టేజీల వద్ద బస్సులు ఆగకపోవడం, రూట్ డ్రైవర్, కండక్టర్ దురుసుగా ప్రవర్తించడం, సమయానికి బస్సులు రాకపోవడం, రద్దీ ప్రాంతాలకు సర్వీసులు లేకపోవడం వంటి వాటిపై ఫిర్యాదు చేయవచ్చన్నారు.

మల్లికార్జునస్వామికి పూజలు

బేతంచెర్ల: హెచ్‌కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న ముచ్చట్ల మల్లికార్జునస్వామి ఆలయంలో వైశాఖమాస సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, పుష్పాలంకరణ చేసి మహా మంగళహారతి ఇచ్చారు.

ఉగ్రవాదులను తుదముట్టించాలి

డోన్ టౌన్: ఉగ్రవాదులను తుదముట్టించాలని డోన్ బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఉగ్రదాడికి నిరసనగా సోమవారం స్థానిక కోర్టు నుంచి పాత బస్టాండ్ వరకు న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్‌నాయుడు, కార్యదర్శి మద్దయ్య, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సహాయకార్యదర్శి రవిమోహన్, కుమారి పాల్గొన్నారు.

పార్కులో అపరిశుభ్రతపై చైర్మన్ అసంతృప్తి



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ సప్తశైల రాజేష్

డోన్: పట్టణ పరిధిలోని ఒకటో సచివాలయం సమీపంలో ఉన్న పార్కులో అపరిశుభ్రతపై మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు పార్కుల్లో అపరిశుభ్రత నెలకొని దుర్గంధం వ్యాపిస్తోందనే ఫిర్యాదులతో సోమవారం పార్కులను తనిఖీ చేశారు. అపరిశుభ్రత ఉండడంతో శానిటరీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఎప్పటికప్పుడు పార్కులను శుభ్రం చేసి పట్టణవాసులకు ఆహ్లాద వాతావరణం కల్పించేలా చూడాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏఈ, డీఈ ఉన్నారు.

రేపు పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి



ప్రవేశ పరీక్ష నిర్వహణపై చర్చిస్తున్న ప్రిన్సిపాల్

బేతంచెర్ల: పట్టణంలో ఈనెల 30వ తేదీ జరిగే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ తెలిపారు. ప్రభుత్వ కళాశాలతో పాటు, సుమేధా స్కూల్, సెంట్ ఆన్స్, రీడ్ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకే కేంద్రానికి చేరుకోవాలని 11 గంటల నుంచి 1 గంట వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



విధులు బహిష్కరించి కోర్టు గేటు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కోవెలకుంట్ల: మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాంలోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఓబులేసు, శేఖర్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ ప్రోద్బలంతోనే ఉగ్రవాదులు అమాయక ప్రజల ప్రాణాలను బలిగొన్నారన్నారు. దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులను బహిరంగంగా ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఉగ్రవాదం సమస్త మానవాళికే ప్రమాదమని.. దేశాన్ని ఉగ్రరహిత దేశంగా తీర్చిదిద్దాలన్నారు. ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రమేష్, కోశాధికారి చంద్రుడు, జాయింట్ సెక్రటరీ సుధాకర్, న్యాయవాదులు నరసింహులు, తిరుపతయ్య, శ్రీనివాసులు, నాగేషు, రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ. 2.50 లక్షల నగదు మిస్సింగ్

కోవెలకుంట్ల: సంజామలకు చెందిన ఓ వ్యక్తి మోటార్‌సైకిల్ సైడ్‌బ్యాగ్‌లో ఉంచుకున్న నగదు కనిపించలేదు. స్థానికుల సమాచారం మేరకు.. సంజామలకు చెందిన శివరామిరెడ్డి బైక్‌లోని సైడ్‌బ్యాగ్‌లో రూ. 2.50 లక్షల నగదు ఉంచుకుని సోమవారం సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు బయలుదేరాడు. పట్టణ శివారులోని రైల్వే వంతెన సమీపంలో ఓ మహిళ చంటిబిడ్డతో వేచి ఉండి లిఫ్ట్‌కోసం బైక్ ఆపాలని చేయి ఎత్తింది. ఆమెను బైక్‌పై ఎక్కించుకోగా కొద్ది దూరంలోనే పెట్రోల్ బంకు వద్ద దిగి వెళ్లిపోయింది. తర్వాత శివరామిరెడ్డి కోవెలకుంట్లకు చేరుకుని కరెంట్ ఆఫీస్‌లో బిల్లు కట్టి తిరిగి టౌన్‌లోకి వెళ్లాడు. సెల్ రిపేరీ ఉండడంతో సెల్‌పాయింట్‌లోకి వెళ్లి రిపేరు చేయించుకుని బైక్ వద్దకు చేరుకున్నాడు. సైడ్‌బ్యాగ్‌లో నగదు పరిశీలించుకోగా లేదు. దీంతో పోలీసులను ఆశ్రయించాడు. రహదారి వెంట ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా ఆ మహిళ పట్టణంలో భిక్షాటన చేసుకుని జీవనం సాగించేదని, డబ్బులు తీయలేదని తేలింది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు

డోన్ టౌన్/కోవెలకుంట్ల/బనగానపల్లె రూరల్: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ డోన్, కోవెలకుంట్ల, బనగానపల్లె ఆర్టీసీ డిపోల ఎదుట కార్మికులు సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఎన్‌ఎంయూ నేతలు మాట్లాడుతూ.. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, నైట్ సర్వీస్ అలవెన్స్‌ను రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలు చెల్లించాలన్నారు. డోన్‌లో డిపో కార్యదర్శి బాల మద్దయ్య, కేవీ రామయ్య, నాగార్జున, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, పుష్పావతి, ఉస్మాన్, మహేంద్ర, కోవెలకుంట్లలో డిపో అధ్యక్షుడు ఆచారి, కార్యదర్శి నరసింహులు, ఓబులేసు, నారాయణ, హెచ్‌పీ రావు, సీహెచ్‌ఎస్ రాజు, బీఆర్ ఆంజనేయులు, కేఎం రాజు, జాకీర్‌ఉసేన్, బనగానపల్లెలో డిపో సెక్రటరీ శ్రీనివాసులు, లక్ష్మన్న, జమ్ములయ్య, ఏసీఎస్ రాముడు, డీవీ సుధామణి, సుమలత పాల్గొన్నారు.



కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో గేటు ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన ఉద్యోగులు

వణికించిన వరుణుడు

- ఎండాకాలంలో అకాల వర్షాలు
- కొలిమిగుండ్లలో అత్యధికంగా 48 మి.మీ
- దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మిరప పంటలు

కోవెలకుంట్ల: అన్నదాతలను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. బనగానపల్లె నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొలిమిగుండ్ల మండలంలో అత్యధికంగా 48 మి.మీ, బనగానపల్లె మండలంలో 23.2 మి.మీ, అవుకులో 22.4 మి.మీ, కోవెలకుంట్లలో 2.4 మి.మీ, సంజామల మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షం కారణంగా రబీ సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న, మిరప, పొగాకు పంటలకు నష్టం వాటిల్లింది. నియోజకవర్గం వ్యాప్తంగా రబీలో విస్తారంగా వరి పంటను సాగు చేసి రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 40 వేలు వెచ్చించారు. నూర్పిడి చేసి ధాన్యాన్ని కల్లాలు, పొలాల్లో ఆరబోసుకున్నారు. మొక్కజొన్న, మిరప పంటలో చివరి కోతలు, పొగాకు దిగుబడులు కలాల్లో ఉన్నాయి. ఈ తరుణంలో కురిసిన వర్షంతో దిగుబడులను ముంచెత్తింది. పట్టలు కప్పుకున్నా వడ్లు, మిరపకాయలు తడిచిపోయాయని రైతులు వాపోతున్నారు. మార్కెట్‌లో మద్దతు ధర లేక దిగాలు చెందుతున్న రైతులకు అకాల వర్షాలు వరుసగా దెబ్బతీస్తున్నాయి. సోమవారం వరుణుడు తెరప ఇవ్వడంతో తడిచిన పంట ఉత్పత్తులను ఆరబోసుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షం కారణంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ జలమయమైంది. ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.



వర్షం కారణంగా జలమయమైన కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్

బనగానపల్లె: మండలంలో కురిసిన వర్షానికి మామిడి కాయలు నేలరాలాయి. కల్లాల్లో ఉంచిన ధాన్యం తడిసిపోయింది. కష్టపడి సాగుచేసిన పంట కళ్ల ముందే నీటిపాలు కావడంతో రైతులు కన్నీరు మున్నీరయ్యారు.

అవుకు: మండలంలో కురిసిన వర్షానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. రామాపురం, కొండమనాయునిపల్లె, గుండ్లశింగవరం, అవుకుతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం తీవ్ర గాలులు వీచి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సోమవారం ఉదయానికి రైతులు పంటల వద్దకు వచ్చి నేలవాలిన పంటలను చూసి లబోదిబోమన్నారు. వరి, మొక్కజొన్న కోత దశలో ఉన్నాయి. మండలంలో సుమారు 390 ఎకరాల వరి, 59 ఎకరాల మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. ముఖ్యంగా కోతల అనంతరం వరి, మొక్కజొన్న, మిరప రైతులు దిగుబడులను కల్లాల్లో ఆరబోశారు. ఉన్నట్టుండి వర్షం కురవడంతో తడిచిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.





కోవెలకుంట్ల: తడిచిన ధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతులు, అవుకు: గాలి వానకు నేలవాలిన వరిపైరు,



మొక్కజొన్న పంట

వేసవిలో ఓరియెంటేషన్ తరగతులు

కోవెలకుంట్ల: పట్టణంలోని గ్రంథాలయంలో సోమవారం ఓరియెంటేషన్ తరగతులను ప్రారంభించినట్లు ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బాలతిమ్మారెడ్డి తెలిపారు. వేసవి సందర్భంగా ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. కథలను చదివించడం, వినిపించడం, క్విజ్ తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

బేతంచెర్ల: పట్టణంలోని గ్రంథాలయంలో సమ్మర్ ఓరియెంటేషన్ తరగతులను ప్రారంభించారు. ముందుగా గ్రాంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్ర పటానికి ఆ శాఖ అధికారి మధుశేఖర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బనగానపల్లె రూరల్: పట్టణంలోని కస్బా ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎం సుంకన్న, సత్యప్రకాష్ సమ్మర్ క్లాస్‌లను ప్రారంభించారు. ఉదయం 8.30 గంటల నుంచి 10.30 గంటల వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. డిజిటల్ తరగతులు, గణితం, ఇంగ్లిష్ చదవడం రాయడంపై శిక్షణ ఇస్తామన్నారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీలో వేర్వేరు కారణాలతో ఇద్దరు వ్యక్తులు సోమవారం ఆత్మహత్యకు యత్నించారు. వివరాలు.. దుర్గాపేట కాలనీకి చెందిన వీరాంజనేయులు తల్లిదండ్రులు తన వద్ద ఉండడం లేదనే మనస్తాపంతో విష ద్రావనం తాగాడు. అదే కాలనీకి చెందిన దేవరాజు భార్య కాంతమ్మ అనారోగ్య సమస్యతో ఆత్మహత్యకు యత్నించింది. ఆయా కుటుంబ సభ్యులు ఇద్దరిని చికిత్స నిమిత్తం శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించారు.

మురుగుతో అవస్థలు



మురుగునీటిలోనే నడిచి వెళ్తున్న మహిళలు



రోడ్డు దాటడానికి తిప్పలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రంగరాజుపేట కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారం చేరుకుని మురుగు నీరు వెళ్లేందుకు అడ్డంకిగా మారింది. దీనికి తోడు డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడే ఆగిపోతోంది. మురుగు నీరు మొత్తం ఇళ్ల ముందు, రోడ్లపైన ప్రవహిస్తోంది. కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు నీరు దోమలకు ఆవాసంగా మారి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. మంచినీరు సరఫరా అయ్యే పైప్‌లైన్ కూడా మురుగునీటిలోనే ఉండడంతో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నా పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



మురుగునీటిలోనే తాగునీటి పైప్‌లైన్



మురుగునీరు ప్రవహించకుండా అడ్డుగా ఉన్న మట్టి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేతంచెర్ల: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ నుంచి సత్రం వరకు విద్యుత్ స్తంభాల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీ మధుసూదన్‌రెడ్డి, ఏఈ పుల్లయ్య తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, ఫ్యాక్టరీ యజమానులు సహకరించాలని కోరారు.